క్లుప్తంగా

సరుకులు అందజేత

బజార్‌హత్నూర్: బీఆర్‌ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు దుబ్బుల చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సురేశ్, అజయ్, ప్రభాకర్, సాయికృష్ణ, భువనచంద్ర, జనార్దన్, లింగన్న పాల్గొన్నారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ.. గత 16 వారాలుగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం తమ వంతుగా రోగుల సహాయకులకు, పేదలు, నిస్సహాయుల ఆకలి తీరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు భూరె సురేశ్, రామకష్ణ, విశాల్, ఆకాష్, షిండే గంభీర్, తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్స్ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సభ్యులు

బోథ్: బోథ్ పట్టణ కార్పెంటర్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలిక్ రమేశ్, ఉపాధ్యక్షుడిగా పాపేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పు దాస్, కోశాధికారిగా అల్లి శంకర్‌లను ఎన్నుకున్నారు.

ఓసీ సంఘాల కార్యవర్గం ఎన్నిక

జైనథ్: ఓసీ సంఘాల మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మామిడి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పూండ్రు అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గడ్డం శ్రీకాంత్ రెడ్డిలతో పాటు కార్యవర్గ సభ్యులను నియమించినట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఓసీ సంఘాల ఐక్యత, అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు.

నిధులు మంజూరు చేయండి


వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

బోథ్: మండల కేంద్రంలోని రజక సంఘానికి రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఎంపీపీ తుల శ్రీనివాస్ కోరారు. ఆదివారం బాసరకు వచ్చిన ఎమ్మెల్సీని ఎంపీపీ కలిసి, ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

మహాసభను జయప్రదం చేయాలి

ఖానాపూర్: నిజామాబాద్‌లో ఈనెల 13, 14వ తేదీల్లో నిర్వహించే తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర తొమ్మిదో మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేశ్ కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసే చట్టాలను విరమించుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు విలాస్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, తదితరులు ఉన్నారు.

పార్‌పెల్లిలో జడకొప్పు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో జడకొప్పు కార్యక్రమం నిర్వహించారు. పార్‌పెల్లిలో ఏటా మార్చి రెండో ఆదివారం జడకొప్పు వేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామస్తులు బస్టాండ్ సమీపంలో జడకొప్పు వేశారు. ఈసందర్భంగా కోలలు వేస్తూ పాటలు పాడారు. పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తూ వెళ్లే క్రమంలో మహిళల జడవలే తాళ్లు అల్లుకోవడం దీని ప్రత్యేకత. గత 20 నుంచి 25 ఏళ్లుగా జడకొప్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సర్పంచ్ రాజేందర్, ఎఫ్ఏ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సదస్సుకు భైంసావాసులు

భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు నిర్వహించారు. దీనికి భైంసా నుంచి పలువురు ఫోరం నాయకులు తరలివెళ్లారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పాల్గొని కేసుల పాలయ్యామని.. ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షులు డా. రామకృష్ణగౌడ్, సభ్యులు జాదవ్ పుండ్లిక్‌రావు, నాగనాథ్, శేఖర్ ఉన్నారు.


బేల యార్డులో లారీలు లేక రైతుల పడిగాపులు

శనగ తరలింపులో జిమ్మిక్కు

- జైనథ్ శనగ లారీలు బేల గోదాంకు
- బేల లారీలు ఆదిలాబాద్ గోదాంకు
- అదనపు రవాణా ఖర్చుల కోసమేనని ఆరోపణలు
- రైతులకు తప్పని పడిగాపులు

బేల: మండల కేంద్రంలోని (జైనథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని) సబ్ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో బేల, డోప్టాల సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న శనగ కొనుగోళ్లలో అధికారులు జిమ్మిక్కు చేస్తున్నారు. జైనథ్ మార్కెట్‌యార్డులో కొనుగోలు చేసిన శనగలను లారీల్లో నింపి బేల సబ్ మార్కెట్‌యార్డు గోదాంకు తరలిస్తున్నారు. బేల సబ్ మార్కెట్‌యార్డులో కొనుగోలు చేసిన శనగలను జైనథ్ మీదుగా నిరాల మార్గంలో ఆదిలాబాద్ సీడ బ్ల్యాసీ గోదాంకు పంపుతున్నారు. కాంటా అనంతరం సకాలంలో బేల యార్డులో లారీలు రాకపోవడంతో లోడింగ్ అయ్యే వరకు శనగ బస్తాల వద్ద రైతులు పడిగాపులు పడతున్నారు. బేల యార్డులో కొనుగోలు చేసిన శనగలను పక్కనే స్థానిక గోదాంలో నింపడానికి అవకాశం ఉన్నప్పటికీ, అలా చేయడం లేదు. శనగ బస్తాలను లారీల్లో లోడింగ్ చేసి 33 కిలోమీటర్ల దూరంలోని ఆదిలాబాద్ గోదాంకు తరలిస్తున్నారు. అయితే అదనపు రవాణా ఖర్చుల కోసమని అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు సైతం భారం మారుతున్నాయి. మరోవైపు బేలలో కాంటా తర్వాత సకాలంలో లారీల లోడింగ్ లేక శనగ రైతులకు ఇబ్బంది పడుతున్నారు.


బేల గోదాముకి జైనథ్ నుంచి వచ్చిన లారీ

బేల, జైనథ్ గోదాంలు ఇలా..

బేల సబ్‌యార్డులో 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచే గోదాం అందుబాటులో ఉంది. జైనథ్ మార్కెట్ యార్డులో ఒకటి 2,500 మెట్రిక్ టన్నులు, మరోటి 100 మెట్రిక్ టన్నుల గోదాంలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో జైనథ్‌లోని 2,500 మెట్రిక్ టన్నుల గోదాన్ని రేషన్ బియ్యంకు కేటాయించారు. 1000 మెట్రిక్ టన్నుల గోదాన్ని బస్తాలు, బీహార్ కూలీల బస, ఇతరత్ర అవసరాలకు కేటాయించారు. బేలలోని 5వేల మెట్రిక్ టన్నుల గోదాంను రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్‌లకు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేసిన పంటల నిల్వల కోసం కేటాయించారు.

రైతుల తిప్పలు..

బేల సబ్‌యార్డులో కొనుగోలు చేసిన శనగ బస్తాలను స్థానిక గోదాంకు తరలించడం లేదు. అంతే కాకుండా కాంటా వేసిన తరువాత లారీలు వస్తేనే లోడింగ్ జరుగుతోంది. లారీలు సకాలంలో రాకపోవడంతో రైతులు పడిగాపులు పడుతున్నారు. బేల యార్డులో కొనుగోలు చేసిన శనగలకు స్థానిక గోదాం కేటాయించినట్లతై ట్రాన్స్‌పోర్ట్ భారం తప్పడంతో పాటు రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ విషయమై జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం నాగేశ్వర్ రావును వివరణ కోరగా.. ఆదిలాబాద్ గోదాంకు శనగల లారీల ప్లోటింగ్ అధికంగా ఉండడంతో జైనథ్ లారీలను బేల గోదాంకు పంపాల్సి వస్తోందన్నారు. బేలలో లారీల కాంటా మరమ్మతులో ఉందన్నారు. దీంతో బేల శనగల లారీలు ఆదిలాబాద్‌కు పంపాల్సి వస్తోందని తెలిపారు.

కాంటా తర్వాత పడిగాపులు



బేల సబ్‌యార్డులో శనగ కొనుగోళ్లలో కాంటా తర్వాత పడిగాపులు కాస్తున్నాం. శనగ పంటను ఈనెల 10న తీసుకువచ్చాను. కాంటా 11న ఉదయం అయింది. కానీ లారీలు లేక శనగలు లోడింగ్ కాలేదు. – నజీర్, రైతు పాటన్

ఇక్కడి గోదాంనే కేటాయించాలి



జైనథ్ శనగ లారీలను బేల మార్కెట్ యార్డులోని గోదాంలో ఖాళీ చేయిస్తున్నారు. మరోవైపు బేల యార్డులో కొనుగోలు చేసిన శనగలను ఆదిలాబాద్ గోదాంకు పంపిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన శనగలకు ఇక్కడి గోదాం కేటాయిస్తే, రైతుల శనగల కొనుగోళ్లు సకాలంలో పూర్తవుతాయి. – గంభీర్, రైతు పాటన్

శిథిలావస్థలో పశువైద్యశాల భవనం


తాంసి: మండలంలోని పొన్నారి పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. గతంలో రేకులతో నిర్మించిన భవనం ప్రస్తుతం కూలిపోయే స్థితిలో ఉంది. దీంతో పశువైద్యాధికారి, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్షరాలు నేర్చేదెలా?

- ఆగిపోయిన 'సాక్షర భారత్'
- ఇంకా ప్రారంభం కాని కొత్త పథకాలు

బోథ్: అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో 36 శాతం నిరక్షరాస్యులు ఉన్నారు. వీరికి అక్షరాలు నేర్పేవారు కరువయ్యారు. గతంలో సాక్షర భారత్ పథకం ఉండడంతో ఆయా గ్రామాల్లో సాక్షర భారత్ కేంద్రాల్లో నిరక్షరాస్యులు చదువుకునే వారు. సాక్షర భారత్‌ను ప్రభుత్వం 2018లో ఆపేసింది. జిల్లాలో ఆదివాసీలు, గిరిజనుల జనాభా ఎక్కువగా ఉంటుంది. ఆయా గ్రామాల్లో చాలా మంది చదువును మధ్యలోనే ఆపేశారు. సాక్షర భారత్‌తో కొంత మేరకు చదువుకుని ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించారు. ప్రస్తుతం సాక్షర భారత్‌ను ఆపివేయడంతో నిరక్షరాస్యులు అలాగే ఉండిపోయారు. కొత్తగా 'నవ భారత్ సాక్షర' అనే కార్యక్రమాన్ని తీసుకొస్తామని గతేడాది ప్రకటించినా.. ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఆదిలాబాద్ జిల్లాలో 6 సంవత్సరాలకు పైగా ఉన్న వారు 6,21,680 జనాభా ఉంది. ఇందులో 3,94,491 మంది అక్షరాస్యులుగా ఉన్నారు. పురుషులు 3,94,491 మంది, మహిళలు 1,65,802 మంది ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 63.50 శాతం మంది అక్షరాస్యులు కాగా.. 36.50శాతం, 1,65,802 మంది నిరక్షరాస్యులు ఉన్నారు.

నిలిచిన అమ్మానాన్నలకు చదువు..

సాక్షర భారత్ పథకం 2009న ప్రారంభమైంది. దాదాపు తొమ్మిది సంవత్సరాల తరువాత 2018లో సాక్షర భారత్‌ను ప్రభుత్వం ఆపివేసింది. కేంద్రం నుంచి నిధులు నిలిచిపోవడంతో ఈపథకానికి స్వస్తి చెప్పారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ద్వారా 'అమ్మానాన్నలకు చదువు' అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పించాలని సూచించారు. ఇందుకోసం పిల్లలు, ఉపాధ్యాయులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. కరోనా రావడంతో కార్యక్రమం కూడా అమలుకు నోచుకోలేదు.



మహిళలే ఎక్కువ..

మహిళల అక్షరాస్యత పెంపుపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆదిలాబాద్ జిల్లాలోని నిరక్షరాస్యుల్లో అధిక భాగం అతివలే కావడం గమనార్హం. గతంలో కేంద్ర ప్రభుత్వం వయోజన విద్య, అక్షర కిరణం కార్యక్రమాలను చేపట్టింది. తర్వాత సాక్షర భారత్‌ను చేపట్టింది. ఈ కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఖాళీగా ఉన్న సమయాల్లో, సాయంకాల సమయాల్లో కొంత వరకు విద్యను నేర్చుకోగలిగారు. ప్రభుత్వాలు దృష్టి సారిస్తే మహిళలల్లో నిరక్షరాస్యత రేటును తగ్గించవచ్చు.

అక్షరాస్యులుగా మార్చాలి

మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ముఖ్యంగా డిజిటల్ విద్యను చేరువ చేయాలి. బ్యాకింగ్‌తో పాటు, వివిధ రకాల డిజిటల్ సేవలను వినియోగించుకునేలా ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాలు చేపట్టాలి.

– పంద్రం శంకర్, న్యాయవాది, సాక్షర భారత మాజీ కోఆర్డినేటర్

అలరించిన పాఠశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బేల: మండలంలోని సోన్‌కాస్ గ్రామంలోని మరాఠీ మీడియం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక నృత్యాలు, ఇండియన్ ఆర్మీ నాటిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం గుర్నులే సతీశ్, సర్పంచ్ మెస్రం జనార్దన్, బీఆర్‌ఎస్ నాయకులు ఠాక్రే గంభీర్, సతీష్ పవార్, ఎస్‌ఎంసీ చైర్మన్ షిండే మహాదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సవారీబంగ్లా షెడ్డు ప్రారంభం


షెడ్డు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి

తలమడుగు: మండలంలోని నందిగామలో ఎమ్మెల్సీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సవారీబంగ్లా షెడ్డును ఆదివారం ప్రారంభించారు. జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి పూజలు చేసి రిబ్బన్ కట్ చేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామాల్లో జెడ్పీ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకన్న, నాయకులు ప్రకాష్‌రావు, రమేష్ రెడ్డి, ప్రతాప్, గంగారం, గ్రామస్తులు రాము, రమాకాంత్, గణేష్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి


రక్తదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఆపదలో ఉన్న వారికి అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవా లని యువ నేస్తం ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి, కళావతి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి రక్తం అవసరం ఉంటుందని, సరైన సమయానికి రక్తం నిల్వలు ఉండడం లేదన్నారు. రక్తదానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. భయం భయంగా చదువులు


నార్నూర్: మండలంలోని భీంపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తలుపులు సరిగా లేకపోవడంతో పశువులు, కుక్కలకు అడ్డగా మారుతోంది. ఉదయం తరగతి గదులకు వెళ్లితే అధ్వానంగా దర్శనమిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న రాథోడ్ సజన్

నేరడిగొండ/ బోథ్/తలమడుగు: ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎంపీపీ రాథోడ్ సజన్, బోథ్ మాజీ ఏఎంసీ చైర్మన్ నారాయణసింగ్, బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి, తదితరులు ఎమ్మెల్యేను కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమంలో నేరడిగొండ వైస్ ఎంపీపీ ఏలేటి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు శివారెడ్డి, జాదవ్ మహేందర్, ఆడె జనార్దన్, కరన్‌సింగ్, సీతారాం, శ్రీనివాస్, సురేశ్, నారాయణ, అడెల్లు, పొశెట్టి, తలమడుగు నాయకులు మొట్టె కిరణ్, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్, జీవన్, బోథ్ నాయకులు ఎలుక రాజు, మేడిచెల్మ ప్రవీణ్ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ లెక్చరర్ విజయబాబు అన్నారు. సరస్వతీ శిశుమందిర్ 1992– 93 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని గజిటెడ్ నెంబర్ 1 ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ కోర్సులు చదవాలో తెలియక విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారని, పదో తరగతి నుంచే విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి సరైన మార్గాన్ని చూపినట్లయితే రాణిస్తారన్నారు. పేరెంట్స్ తమ ఇష్టాన్ని విద్యార్థులపై రుద్దవద్దన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేందర్ జైపాల్ రెడ్డి, నగేశ్, రాకేశ్, కిరణ్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా వేరుశనగ


వడ్డాడి శివారులో సాగు చేస్తున్న వేరుశనగ

తాంసి: మండలంలోని వివిధ గ్రామాల రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంట ప్రస్తుతం ఆశాజనకంగా కనిపిస్తోంది. వాతావరణం అనుకూలించడంతో తెగుళ్ల, వైరస్ ఉధృతి అంతగా లేకపోవడంతో ప్రస్తుతం పంట ఏపుగా పెరిగింది. పంట దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

- 3.21 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం
- ప్రత్యేక దృష్టి సారించిన యంత్రాంగం


నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

బజార్‌హత్నూర్: గత ఏడాది హరితహారం కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీలు బాధ్యత తీసుకొని విజయవంతం చేశారు. ఈ ఏడాది కూడా తొమ్మిదో విడత హరితహారం కోసం సర్వం సిద్ధం చేస్తున్నారు. మండలంలో 30 గ్రామ పంచాయతీల పరిధిలో 3.21 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో అటవీశాఖ, డ్వామా, ఈజీఎస్ ఆధ్వర్యంలో నర్సరీలలో మొక్కలు పెంచేవారు. కానీ గత రెండు సంవత్సరాల నుంచి నర్సరీల బాధ్యత పూర్తిగా గ్రామ పంచాయతీలకు అప్పగించారు. జూన్ రెండో వారం నాటికి మొక్కలు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎండ వేడికి మొక్కలు చనిపోకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

3.21 లక్షల మొక్కలే లక్ష్యం..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈఏడాది మొక్కలు నాటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో 10 వేల మొక్కల పెంపకానికి నర్సరీలను ఏర్పాటు చేశారు. 30 గ్రామ పంచాయతీల పరిధిలో 3.21 లక్షల మొక్కలు పెంచుతున్నారు. గత సంవత్సరం 2,75,000 మొక్కలను ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, రోడ్లకు ఇరువైపులా, రిజర్వు ఫారెస్ట్‌లో మొక్కలు నాటారు. ప్రతీ ఇంటిలో కూడా ఐదు మొక్కల చొప్పున నాటించారు. టేకు, పూలు, పండ్లు, ఎర్ర చందనం, మొక్కలు పెద్ద మొత్తంలో పెంచుతున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మొక్కల పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

ఏపీడీ, ఏపీవోతో పాటు ఎంపీడీవో, ఎంపీవో స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు నర్సరీలను సందర్శించి కూలీలకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. నర్సరీల పరిధిలోని టెక్నికల్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది కొన్ని మండలాల్లో ఏర్పడిన మొక్కల కొరతను అధిగమించేందుకు పకడ్బందీగా మొక్కల పెంపకం చేపడుతున్నారు. పండ్ల మొక్కలు సీతాఫలం, దానిమ్మ, మునగ, నిమ్మ, సంత్ర, సపోట, జామ, తదితర మొక్కలను విరివిరిగా పెంచుతున్నారు. పూల మొక్కల్లో గులాబీ, మల్లే, గన్నేరు మొక్కలను పెంచుతున్నారు. అటవీ ప్రాంతంలో నాటేందుకు నల్లమద్ది, టేకు, వెదురు మొక్కలను సిద్ధం చేస్తున్నారు.

మొక్కల సంరక్షణ పంచాయతీలదే



జూన్ రెండో వారం నాటికి నర్సరీల్లో మొక్కల పెంపకం పూర్తవుతుంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే జూన్‌లో మొక్కలు నాటుతాం. ప్రతీ గ్రామంలో హరిత హారం కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. మొక్కల సంరక్షణ గ్రామపంచాయతీలదే బాధ్యత.

– మహేందర్‌రెడ్డి, ఎంపీవో, బజార్‌హత్నూర్